

# మారే కాలం

డాక్టర్ వరప్రసాద్ ఆనందాశ్రమం కమిటీ సభ్యులను తీసుకుని తన మేనమామ కొడుకు సాంబశివరావు దగ్గరకు వెళ్ళాడు. తీరికగా పుస్తకాలు తిరగేస్తున్న అతను అందర్నీ ఆహ్వానించాడు.

"మా బావ ! ఇరిగేషన్లో ఇంజనీర్గా చేసి రిటైరయ్యాడు" అని అందరికీ పరిచయం చేశాడు.

సాంబశివరావు పెద్ద కోడలు పద్మావతి కాఫీలు తెచ్చి ఇచ్చింది.

"బావా ! మా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ తరపున ఒక ఆశ్రమం కడుతున్నాం. ఎందుకంటే ఇప్పుడు కుటుంబాల పరిస్థితి మారిపోతున్నది. పిల్లలు అమెరికా, ఆస్ట్రేలియా అంటూ వెళ్ళిపోతున్నారు. ఇక్కడ ఒంటరి జీవితం ఈ ముసలితనంలో దుర్భరంగా వుంటోంది. ఒంటరిగా వుంటున్న వృద్ధులను కొందరు టార్గెట్ చేసి దొంగతనాలు చేస్తున్నారు. డబ్బుకోసం మర్డర్లు గూడా చేస్తున్నారు. అటువంటి వారికోసం మనమే నిర్వహించుకునే ఆశ్రమం ప్లాన్ చేశాం. నువ్వు గూడా ఒక కాటేజ్ తీసుకో. ఇప్పుడే వచ్చి

అక్కడ వుండాలనేం లేదు. ముందు ముందు కుటుంబంలో మార్పులు వచ్చి ఒంటరిగా వుంటే బాగుంటుందనుకున్నప్పుడు అక్కడ వుండొచ్చు" వివరంగా చెప్పాడు డాక్టర్ వరప్రసాద్.

సాంబశిరావు నవ్వాడు.

"ఓల్డేజి హోమ్‌లో వుండే అవసరం నాకు రాదులే. ఇద్దరు కొడుకుల్ని ఒకే ఇంట్లో వుంచి మేనేజ్ చేస్తున్నాను. అంతా ఉమ్మడిగా వుంటున్నారు. నా మాట కొడుకులు, కోడళ్ళు జవదాటరు. నేను కావాలంటే ప్రాణం ఇస్తారు" అన్నాడు.

"అది సరే ! నిన్ను ఇప్పుడే అక్కడకు వచ్చి వుండమనడం లేదు. మన ఆరోగ్యం ఎప్పుడూ ఇలాగే స్టడీగా వుండదు కదా ! మనకి ఆరోగ్యం బాగా లేక మంచాన పడినప్పుడు మనతో మాటా మంతీ చెప్పడానికి ఇంట్లో వాళ్ళకి తీరిక వుండదు. ఆశ్రమంలో వుంటే అంతా మన వయస్సు వాళ్ళుంటారు. కొన్ని ఆశ్రమాలు స్టడీ చేశాం. ఎవరికైనా ఆపద వస్తే మేమున్నామని అంతా వెళ్ళి పలకరించి ధైర్యం చెప్తారు. ఒంటరి వాళ్ళమనే భావం కలగదు. చాలామంది మేగ్జయిన్స్, పుస్తకాలు చదువుతూ, కేరమ్స్, చెస్ ఆడుకుంటూ హాయిగా కాలక్షేపం చేస్తున్నారు. ఎందుకైనా మంచిది బావా ! నువ్వు గూడా ఒక కాటేజ్ బుక్ చెయ్యి. నీ పేరుతో వుంటుంది" నచ్చజెప్పాడు వరప్రసాద్.

"తర్వాత చూద్దాంలే !" అన్నాడు సాంబశివరావు.

"నీకు మరీ ఓవర్ కాన్ఫిడెన్స్ పనికి రాదురా ! నీ కొడుకులు నువ్వు కావాలంటే ప్రాణాలు ఇస్తారని భ్రమపడుతున్నావు. సమయం వస్తేగాని మనుషుల బుద్ధి బైటపడదు"

డాక్టర్ వరప్రసాద్ ఎంత చెప్పినా సాంబశివరావు ఆశ్రమంలో కాటేజి తీసుకోవడానికి ఒప్పుకోలేదు.

"సాంబశివరావుగారికి ఇష్టంలేప్పుడు మీరెందుకు బలవంతం చేస్తారు డాక్టర్ గారూ !" అన్నాడు సెక్రెట్రీ.

అంతా సెలవు తీసుకుని వచ్చేశారు.

"రోజులన్నీ మనవి కాదని తెలీదు వెధవకి" బైటకు వచ్చాక డాక్టర్ వరప్రసాద్ తన మేనమామ కొడుకు మీద కామెంట్ చేశాడు.

"సర్లెండి, ఎవరిష్టం వారిది. అంతా మనతో ఏకీభవించాలని ఏముంది? ఆయనకు మన ఆశ్రమంతో అవసరం రాకూడదని ఆ భగవంతుడిని ప్రార్థిద్దాం" అన్నాడు ట్రెజరర్ పరమహంస.

★ ★ ★

సీనియర్ సిటిజన్స్ విలేజ్‌కి సభ్యులేగాక సిటీలోని కోటీశ్వరులు గూడా విరాళాలు ఇవ్వడంతో బిల్డింగ్స్ పని వేగంగా సాగింది. భవనాలతోపాటు స్టాఫ్ క్వార్టర్స్, యోగా హాలు, వాకింగ్ ట్రాక్, చెట్లు పెంచే కార్యక్రమాలు సాగుతున్నాయి. డాక్టర్ వరప్రసాద్ అంతా నెత్తిన వేసుకుని సిన్సియర్‌గా పనులు చేస్తున్నాడు.

ప్రారంభోత్సవం ముఖ్యమంత్రితో చేయించాలా? గవర్నర్‌ని పిలిస్తే బాగుంటుందా? అని ఆలోచిస్తున్నాడు.

డాక్టర్ వరప్రసాద్ తన మేనమామ కొడుక్కి బాగా లేదనీ, నర్సింగ్ హోమ్‌లో చేర్పించామనీ ఫోన్ చేసి చెప్పారు. తను మళ్ళీ వచ్చేవరకు సెక్రటరీని శ్రద్ధగా పనులు చేయించమన్నాడు.

సాంబశివరావుకి తీవ్రమైన జ్వరం. వళ్ళంతా నొప్పులు. వారం రోజులైనా తగ్గలేదు. నర్సింగ్ హోమ్‌లోనే వుండి డాక్టర్ వరప్రసాద్ అన్ని టెస్టులు చేయించాడు. ఎంతైనా మేనమామ కొడుకు. చిన్నతనం నుంచి కలసిమెలసి పెరిగారు. అందుకే ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాడు. నర్సింగ్‌హోమ్ అధినేత ప్రతాప్ గూడా వరప్రసాద్ స్నేహితుడే.

ఒకరోజు ముఖం వేలాడేసుకుని రిపోర్టులన్నీ పట్టుకొచ్చి కూర్చున్నాడు డాక్టర్ వరప్రసాద్. అతన్ని చూస్తుంటే తన పరిస్థితి దిగజారిందనీ, సీరియస్‌గా వుందనీ గ్రహించాడు సాంబశివరావు.

"సారీరా ! నీకు రెండు కిడ్నీలు పాడయ్యాయి. ట్రాన్స్‌ప్లాంట్ చేస్తేగాని లాభం లేదు" చెప్పాడు వరప్రసాద్.

సాంబశివరావు అదిరిపడ్డాడు అది విని. ఇన్నాళ్ళూ తనది ఉక్కు శరీరమనీ, తనకి ఏ జబ్బూ రాదని గర్వపడుతుండేవాడు. తనకు బి.పి. షుగర్ లేవని అని సుష్టుగా తింటూ వుండేవాడు. ఆ సంగతి అందరితో అనేవాడు.

తన తోటి వాళ్ళంతా రిటైరైపోయి పనీ పాటా చెయ్యకుండా సోమరిపోతుల్లా కూర్చుని తింటున్నారనీ, అందుకే హార్టెటాకులు, బి.పీలు షుగర్లు వస్తున్నాయనీ కామెంట్స్ చేసి ఆనందించేవాడు. అవేవీ రాకపోయినా కిడ్నీలు పాడైపోయి పరిస్థితి దిగజారడం సాంబశిరావుని ఆందోళనకి గురిచేసింది.

"వర్రీ పడకురా ! నీకు ఇద్దరు కొడుకులున్నారు. కూతురు వుంది. ఎవరో ఒకరు కిడ్నీ దానం చేస్తారు. ఆపరేషన్ సక్సెస్ అవుతుంది. అదే విషయం ఆలోచిస్తూ మనసు పాడు చేసుకోకు" అని సాంబశివరావుని వూరడించాడు డాక్టర్ వరప్రసాద్.

సాంబశివరావు కొడుకులు రమేష్, సురేష్ ఇద్దరికీ ఫోన్‌చేసి వెంటనే హాస్పిటలుకి రమ్మన్నాడు వరప్రసాద్. ఇద్దరూ వచ్చాక విషయం చెప్పాడు.

"మీ ఇద్దర్లో ఎవరు కిడ్నీ దానం చేస్తారో తేల్చుకోండి" అన్నాడు వరప్రసాద్.

రమేష్, సురేష్ ముఖాలు చూసుకున్నారు.

"ఆలోచించుకుని చెప్తాం మావయ్యా !" అని తండ్రి దగ్గర కాసేపు కూర్చుని వెళ్ళిపోయారు.

★ ★ ★

రమేష్ ఇంటికి రాగానే అతని భార్య పద్మావతి "ఏమిటి ఈ రోజు ఇంత ఆలస్యం చేశారు? పిల్లలు ఎగ్జిబిషన్‌కి వెళ్దామని ఒకటే గోల. మీ సెల్‌కి రింగ్‌చేస్తే ఔటాఫ్ ఏరియా అని వస్తోంది" విసుగ్గా అన్నది.

"నాన్నకి బాగాలేదు. హాస్పిటల్‌కి వెళ్ళాను. లేటైంది !" అన్నాడు.

"ఏమైంది? ఇంకా జ్వరం తగ్గలేదా? ఆయనకి జ్వరం రావడం, హాస్పిటల్ పాలవడం నా చావుకొచ్చింది. పిల్లల్ని స్కూలుకి తీసుకెళ్ళడం, తీసుకురావడం నా వల్ల కావడం లేదు. స్కూల్ బ్యాగ్స్ బియ్యం బస్తా అంత బరువులు. ఏం పుస్తకాలో? ఏం చదువులో?" పద్మావతి నాన్‌స్టాప్‌గా మాట్లాడుతోంది.

"నాన్న ఇప్పట్లో హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయ్యేట్లు లేదు. పోనీ ఏదైనా ఆటో మాట్లాడకూడదా?" అన్నాడు రమేష్.

"ఫర్లాంగు దూరం గూడా లేదు. ఏ ఆటోవాడొస్తాడు? మనమే ఎట్లాగో తిప్పలు పడాలి. ఇంతకీ ఏంటంట మీ నాన్నకి? సీరియస్సా?" ప్రశ్నించింది పద్మావతి.

రమేష్ తల వూపాడు.

"కిడ్నీలు చెడిపోయాయంటున్నారు. ట్రాన్స్‌ప్లాంట్ చేస్తేగాని లాభంలేదని మావయ్య చెప్పాడు. అందుకే ఇప్పటి వరకు హాస్పిటల్లో వున్నాను" అన్నాడు.

పద్మావతి స్థాణువులా నిలబడిపోయింది. ఆమె ముఖంలో అనుమానపు నీలి నీడలు కదిలాయి. భర్తవైపు తేరిపార చూసింది.

"కొంపదీసి మీరు కిడ్నీ దానం చేస్తారా !" ప్రశ్నించింది పద్మావతి.

"నేనో, తమ్ముడో ఇవ్వాల్సివుంటుందని మావయ్య అంటున్నాడు" నిట్టూరుస్తూ అన్నాడు రమేష్.

"మీరు మాత్రం ఇవ్వకండి. వయసులో ఉన్నారు. ఎంతో జీవితం ముందుంది. తర్వాత ఆ వున్న ఒక్క కిడ్నీ సరిగా పనిచేయకపోతే ఏంచేస్తారు? మీకు దానం చేయడానికి ఎవరున్నారు? పిల్లలు పసివాళ్ళు గదా?" సీరియస్‌గా అన్నది పద్మావతి.

"బాగానే వుందే నువ్వు చెప్పేది? పెద్దవాడిని నేను ఇవ్వనంటే? చిన్నవాడెందుకు ముందుకొస్తాడు? చూసేవాళ్ళేమనుకుంటారు? కన్నతండ్రి ప్రాణంపోతుంటే చూస్తూ వూరుకున్నారు కొడుకులని ఆడిపోసుకోరూ?" అన్నాడు రమేష్ అసహనంతో.

"ఎవరో ఏదో అనుకుంటారని మీ జీవితం నాశనం చేసుకుంటారా? నేను చస్తే ఒప్పుకోను. నా మాట కాదని మీరు కిడ్నీ దానం చేశారంటే వురిపోసుకుని చస్తాను" పెద్దగా కేకలు పెట్టింది పద్మావతి.

పక్క గదిలో సురేష్ దంపతులు గూడా ఇలాగే వాదించుకుంటున్నారు.

"మీరు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో కిడ్నీ దానం చెయ్యడానికి నేను ఒప్పుకోను. పెద్దవాడు మీ అన్నయ్యను ఇవ్వమనండి. మీకన్నా ఎక్కువ బాధ్యత బావగారికే వుంటుంది" అన్నది నళిని.

"బాధ్యతల్లో ఎక్కువా తక్కువ ఏంటి? ఆస్తిని సమానంగా పంచుకోమా? అది కాదు సమస్య. అన్నయ్య నన్ను కిడ్నీ ఇవ్వమని అడిగితే ఏం చెప్పాలా? అని ఆలోచిస్తున్నాను" అన్నాడు సురేష్.

"అలా ఎందుకడుగుతారు? ఆయనేమైనా జబ్బు మనిషా? ముసలాయనా?"

"నీకర్థం కావడంలా ! రేపు మా డాక్టర్ మామయ్య ముందు నిలబెట్టి నీ కిడ్నీ ఇవ్వరా ! అది సూటవుతుందట. నాది సుటుకాదంట అని అన్నాడనుకో ! అప్పుడేంటి పరిస్థితి? నేనివ్వనని అంటే నా బుద్ధి బైటపడిపోదూ? అందరూ నానా మాటలు అంటారు" అన్నాడు సురేష్.

"మీ వదిన తక్కువది కాదు. ఇలాంటి నాటకమేదో ఆడిస్తుంది కూడాను. మీ డాక్టర్ మావయ్య ఆవిడకు స్వంత బాబాయి కూడాను." అన్నది నళిని అక్కసుతో.

సురేష్ ఆలోచనలో పడిపోయాడు. భార్య అన్నదాంట్లో గూడా రీజనింగ్ వుందనిపించింది. డాక్టర్ మావయ్య నిజాయితీగా ప్రవర్తిస్తాదని నమ్మకం ఏవుంది? వదినతో వున్న చుట్టరికం వలన అన్నయ్యను సేవ్ చేయడానికి ప్రయత్నిస్తాడేమో? అప్పుడు కిడ్నీ ఇవ్వాల్సిన బాధ్యత తనకు తప్పనిసరవుతుంది.

ఆలోచనలతో సురేష్‌కి పిచ్చెక్కినట్లయింది.

ఇంతలో హాల్లో తులశమ్మ గొంతు వినిపించింది. ఆమె నళిని తల్లి. సురేష్ నళిని హాల్లోకి వెళ్ళారు.

"ఏమ్మా ! మీ మావగారికి ఎట్లావుంది? ఇంకా ఆసుపత్రిలోనే వున్నారా? వారం నుంచీ వద్దామనుకుంటున్నాను. ఎక్కడా... కుదర్డంలేదు" అన్నది కూతుర్ని చూస్తూనే.

"ఏం బాగాలేదమ్మా ! ఆయన గూడా ఇప్పుడే ఆసుపత్రి నుంచి వచ్చారు. మావగారికి రెండు కిడ్నీలు చెడిపోయాయట" చెప్పింది నళిని.

తులశమ్మ విస్తుపోయింది.

"ఎట్లాగే మరి? పాపం ఈ వయసులో ఆయనకి ఎంత కష్టం వచ్చింది. అసలే భార్యపోయి ఒంటరివాడై పోయాడు. ఏదో కొడుకుల్ని, కోడళ్ళని మనవళ్ళని చూసుకుని బతుకుతున్నాడు" అని సానుభూతి చూపించింది.

"అదేనమ్మా అర్థం కావడంలేదు. ఇద్దరు కొడుకుల్లో ఎవరో ఒకరు కిడ్నీ దానం చేయాలట" దిగులుగా చెప్పింది నళిని.

"మీ బావగారు ఇస్తారేమో !" నెమ్మదిగా అన్నది తులశమ్మ.

"న్యాయంగా పెద్దకొడుకు ఇవ్వాలి గాని, మా బావగారు డాక్టర్‌గారికి వదిన అల్లుడుగా అందుకని..." అని తన మనసులోని అనుమానం తల్లి ముందు పెట్టింది నళిని.

తులశమ్మ తన కూతురు ముందాలోచనకు నోరు తెరిచింది. దీనికి ఎంత తెలివో? అని లోలోపల మురిసిపోయింది.

"పిన్నిగారూ బాగున్నారా?" కాఫీ కప్పు, మంచినీళ్ళ గ్లాసు ట్రేలో పెట్టుకుని హాల్లోకి ప్రవేశించి పద్మావతి.

"ఆఁ...బాగానే వున్నానమ్మా ! మీ మావగారికి బాగా లేదటగా. చూసి పలకరించి పోదామని వచ్చాను. పిల్లలు ఎలా వున్నారు. బాగా చదువుతున్నారా?" అని కుశల ప్రశ్నలు వేసింది తులశమ్మ.

పద్మావతి ట్రే టీపాయ్ మీద వుంచి తనూ కూర్చుని మాటల్లో పడింది.

"నాకు తెలియక అడుగుతాను. మీ మావగారికి దాదాపు డెబ్బై ఏళ్ళనుకుంటాను. ఇంకెన్నాళ్ళు బతుకుతాడు? మహా ఐతే మూడు, నాలుగేళ్ళు. అంతమాత్రం దానికి కొడుకుల కిడ్నీలు తీసిచ్చి బతికించాలా? పుట్టినవాడు గిట్టక తప్పదు" అన్నది తులశమ్మ.

"ఆ మాట నిజమే పిన్నిగారూ ! కాని లోకం ఏమనుకుంటుంది? ఇద్దరు కొడుకు లుండి కిడ్నీ దానం చేయలేకపోయారని ఆడిపోసుకోదూ !" అన్నది పద్మావతి.

"ఆఁ... లోకం పలు కాకులు. మూయడానికి మూకుడు లేదని ఎన్నో అనుకుంటారు. ఏదో డబ్బా ! బీరువాలో నుంచి గబుక్కున తీసివ్వడానికి. శరీరం కోసివ్వాలి. మాటలా? నాలుగు కాలాలపాటు వుండాల్సిన వాళ్ళు. వయసులో వున్నారు. తర్వాత ఏమైనా ఐతే ఆదుకునే వాళ్ళెవరు?" అన్నది తులశమ్మ.

"నేననేది అదే పిన్నీ ! కాని మావారు ఎవరేమనుకుంటారో అని భయపడుతున్నారు" అన్నది పద్మావతి.

"ఆఁ... సింగినాదం. ఎవరేమనుకుంటే మనకేం? మన సౌకర్యం చూసుకోవాలి గాని" అన్నది తులశమ్మ.

"అత్తయ్యా ! బాగున్నారా?" అంటూ వచ్చాడు రమేష్.

అంతా కూర్చుని చర్చలు జరిపారు.

"పెద్దదాన్ని చెప్తున్నాను నా మాట వినండి. ఈ రోజుల్లో డబ్బుంటే కొనలేనిది ఏం లేదు. లక్షరూపాయలు పారేసైనా ఎవరో ఒకరిది కిడ్నీ కొని మీ నాన్నకి పెట్టించండి. డబ్బుకోసం అమ్ముకునేవాళ్ళు బోలెడు మంది దొరుకుతారు" చెప్పింది తులశమ్మ.

ఆమె మాటలు విని అందరి ముఖాలు చంద్రకాంతి కిరణాలు పడిన కలువ పువ్వుల్లా వికసించాయి.

"మీ ఐడియా బాగుంది అత్తయ్యా !" అని రమేష్ మెచ్చుకున్నాడు.

"ఎంతైనా ప్లీడరు పెళ్ళాన్ని. ఐడియా లెందుకురావు" అన్నది తులశమ్మ నవ్వుతూ.

"ఈ ఐడియా మాకు తట్టనే లేదమ్మా !" అన్నది నళిని.

"పిన్నిగారు దేవుళ్ళా వచ్చి మంచి ఆలోచన చెప్పారు. ఏమండీ రేపే పేపర్లో ప్రకటన ఇవ్వండి. గొడవ వదిలిపోతుంది" అన్నది పద్మావతి సంతోషపడిపోతూ.

★ ★ ★

మర్నాడు అన్నదమ్ములిద్దరూ కలిసి హాస్పిటల్‌కి వెళ్ళారు. ఇప్పుడు గుండెలమీద భారం తొలగిపోయినట్ల హాయిగా వుంది వాళ్ళకి. వీళ్ళు వెళ్ళేటప్పటికి డాక్టర్ వరప్రసాద్ సాంబశివరావు బెడ్ పక్కనే కూర్చుని మాట్లాడుతున్నాడు.

"మావయ్యా ! మాట" అని వరప్రసాద్‌ని పక్కకు పిలిచాడు రమేష్.

"ఏంట్రా?" అంటూ వచ్చాడు వరప్రసాద్.

ఆయన్ని కొంచెం దూరం తీసుకెళ్ళి "మావయ్యా ! మేమొకటి నిర్ణయించుకున్నాం" అన్నాడు రమేష్.

"ఏంటి?"

"మావయ్యా ! నా కిడ్నీ ఇవ్వడానికి మా ఆవిడ ఒప్పుకోవడంలేదు" అన్నాడు రమేష్.

"మా ఆవిడా అంతే. ఇస్తే కోర్టుకెళ్ళి విడాకులిస్తానని బెదిరిస్తోంది"అన్నాడు సురేష్.

"మా ఆవిడ వురిపోసుకుని చస్తానంటోంది" అన్నాడు రమేష్.

"ఐతే ఏం చేద్దాం?" ప్రశ్నించాడు డాక్టర్ వరప్రసాద్.

"ఎవరిదైనా కిడ్నీ కొని ట్రాన్స్‌ప్లాంట్ చేయిద్దాం" ముక్తకంఠంతో అన్నారు.

వరప్రసాద్ నవ్వి "దానిదేముంది? అలా గూడా చెయ్యొచ్చు. పదండి నాన్నకి చెప్పుదాం" అన్నాడు.

ముగ్గురూ సాంబశివరావు బెడ్ దగ్గరికి వెళ్ళారు.

"ఏంట్రా? నీ అల్లుళ్ళు సీక్రెట్‌గా మాట్లాడుతున్నారు" అన్నాడు సాంబశివరావు.

"అః... ఏం లేదు. నీకు వాళ్ళ కిడ్నీలు దానం చెయ్యడానికి భార్యలు ఒప్పుకోవడం లేదట. ఎవరిదైనా కొని ట్రాన్స్‌ప్లాంట్ చేద్దామంటున్నారు" చెప్పాడు డాక్టర్ వరప్రసాద్.

ఆ మాట విని సాంబశివరావు ముఖం నల్లగా మాడిపోయింది.

ఒకసారి కొడుకుల వైపు చూసి ముఖం తిప్పుకున్నాడు. వాళ్ళు ఇబ్బంది పడుతూ తలలు వంచుకుని నేలచూపులు చూస్తూ నిల్చున్నారు.

"సరేరా ! ఆ ఏర్పాట్లేవో నేను చూస్తాలే" అన్నాడు వరప్రసాద్.

'హమ్మ ! బతికాం' అనుకుంటూ ఇద్దరూ జారుకున్నారు.

సాంబశివరావు కళ్ళనుంచి కారుతున్న కన్నీళ్ళని తుడుస్తూ "చూశావుగా నీ కొడుకుల, కోడళ్ళ నిజ స్వరూపం. ఎవరి బుద్ధయినా సమయంవస్తే గాని బైటపడదు" అన్నాడు డాక్టర్ వరప్రసాద్.

"ఒరేయ్ ! నాకెవరి కిడ్నీ అవసరంలేదు. నన్ను ఇట్లా చావనీ బతికి ఎవర్నుద్ధరించాలి" కోపంగా అన్నాడు సాంబశివరావు.

వరప్రసాద్ పకపక నవ్వాడు.

"ఒరేయ్ ! నీకు ఎవరి కిడ్నీ అవసరంలేదు. నిజం చెప్తున్నాను. నీ కొడుకులు నీ కోసం ప్రాణమైనా ఇస్తారనే భ్రమలో వున్నావు కదా ! అది ఎంత వరకు నిజమో నువ్వు తెలుసుకోవాలని చిన్న నాటకం ఆడాను, అంతే. నీకే ప్రాబ్లంలేదు" అన్నాడు.

సాంబశిరావు గూడా నవ్వాడు.

"నువ్వు లోగడ అన్న మాటలు గుర్తున్నాయిలేరా ! మనిషి బుద్ధి సమయం వస్తేగాని బైటపడదన్నావు. నిజమే. నా కొడుకులు తమ కిడ్నీ దానం చెయ్యడానికి వెనుకాడ్డం సహజమే. ఎందుకంటే వాళ్ళమీద వత్తిడి వుంటుంది. కాని మాటవరసకి 'నీకేం భయం లేదు నాన్నా ! మా కిడ్నీ ఇచ్చి బతికించుకుంటాం' అని వుంటే ఎంతో సంతోషించి వుండేవాడిని. నేను చివరి దశకు వచ్చాను. ఇంకా జీవితం ఎవర్ని వుద్ధరించాలి? నేను బతకడం కోసం వాళ్ళ భవిష్యత్తు బలిపెట్టడం నాకూ ఇష్టంలేదు. ఉన్నన్నాళ్ళూ మందుల మీద ఆధారపడాలని నిర్ణయించుకున్నాను" అన్నాడు.

"మానవ సంబంధాలలో మార్పులు వస్తున్నాయనీ, కాలం మారుతున్నదనీ, కాలంతోపాటు మనం కూడా మారాలని నీకు తెలియజెప్పడమే నా వుద్దేశ్యం. మనం ఆరోగ్యంగా తిరుగుతున్నంత కాలం బాగానే వుంటుంది. ఏదైనా జబ్బు వచ్చి మూలపడితే ఒంటరివాళ్ళమైపోతాం. ఎవరి పనులు వాళ్ళకి వుంటాయి. మనతో సరిగా మాట్లాడ్డం లేదని మనం ఫీలవుతూ వుండడం ఎందుకు? అటువంటప్పుడు ఆనంద నిలయంలో చివరి రోజులు గడపడం అందరికీ ఆనందంగా వుంటుంది. అందుకే మేము బాగా ఆలోచించి ఆశ్రమం మొదలుపెట్టాం" అన్నాడు వరప్రసాద్.

"బాగానే వుంటుందిలేరా ! అనుభవం ఐతేగాని తత్వం బోధపడదన్నారు. ఎందుకైనా మంచిది ఆశ్రమంలో నాకు కూడా ఒక కాటేజ్ బుక్ చెయ్యి" అన్నాడు సాంబశివరావు.

-ఆంధ్రభూమి వారపత్రిక *10-4-2008*